AKSHARA TODAY
అక్షర పటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక దోపిడీ



2



ఎన్నికల కమిషనర్ దిష్టిబొమ్మ దహనం

2

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రమాదేవి



అక్షరటుడే, ముప్కాల్: మండల కేంద్రానికి చెందిన జి.రమాదేవి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఆమె ప్రస్తుతం బాల్కొండ మండలం బస్సాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆమెను ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన రమాదేవికి తోటి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్యే మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

అక్షరటుడే, ఎల్లారెడ్డి : గాంధారి మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గాంధారి మండల మాజీ వీడీసీ అధ్యక్షుడు నాగులూర్ మల్లేష్, బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షులు, వార్డు సభ్యులు జింగూరి సురేష్‌తో పాటు వార్డు సభ్యులు గంగి రవి యాదవ్, బెల్లాయి అశోక్, చడ్మాల్ సాయిలు, బాలరాజుగారి శ్రీకాంత్, పెద్దబూరి రాములు తదితరులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధారి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్, గాంధారి ప్యాక్స్ చైర్మన్, గాంధారి సర్పంచ్, ఉపసర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సుధాకర్ మృతిపై సమగ్ర విచారణ

అక్షరటుడే, భీమ్‌గల్: పోలీస సుధాకర్ మృతి ఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పొన్నం సత్యనారాయణ గౌడ్ తెలిపారు. బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా స్థానిక కిరాణా వ్యాపారిపై ఇప్పటికే కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. వ్యాపారితో పాటు స్థానిక ఎస్సై తిరుపతిపై కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలపైనా శాఖాపరమైన విచారణ చేపట్టామని, విచారణలో తేలిన నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సుధాకర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో భీమ్‌గల్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అదనపు బలగాలను మోహరించారు. సుధాకర్ కుటుంబ సభ్యులు, అఖిలపక్ష నాయకులు, స్థానిక వ్యాపారులు చేపట్టిన ఆందోళన కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగింది. బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయడంతో ఆందోళనకారులు తమ నిరసనను విరమించారు. ఈ ఘటనపై పారదర్శకంగా విచారణ జరిపి, బాధిత కుటుంబానికి తక్షణమే పూర్తి న్యాయం చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

సహకార సంఘాలకు 'నామినేటెడ్' పాలకవర్గాలు

జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో నూతన పాలకవర్గాల నియామక ప్రక్రియ వేగం పుంజుకుంది. ప్రభుత్వం నామినేటెడ్ విధానంలో పాలకవర్గాలను నియమిస్తుండటంతో ఆయా సంఘాల్లో కొత్త పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరిస్తున్నాయి. తాజాగా నియమితులైన పలువురు చైర్మన్లు, డైరెక్టర్లు బాధ్యతలు చేపట్టారు.

- అక్షరటుడే, ఎల్లారెడ్డి



■ పలు సంఘాలకు ఛైర్మన్లు, డైరెక్టర్లను నియమించిన ప్రభుత్వం ■ బాధ్యతలు స్వీకరించిన ఛైర్మన్లు
■ రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం ■ కొత్త పాలకవర్గాలతో సొసైటీల్లో ఉత్సాహం

సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోళ్లు తదితర సేవలు అందుతున్న నేపథ్యంలో నూతన పాలకవర్గాలపై రైతుల్లో ఆశలు నెలకొన్నాయి. తమ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటూ సహకార సంఘాలను మరింత బలోపేతం చేస్తామని నూతన ఛైర్మన్లు పేర్కొంటున్నారు.

22 సంఘాలకు..

కామారెడ్డి జిల్లాలో మొత్తం 55 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉండగా, ఇప్పటివరకు 22 సంఘాలకు పాలకవర్గాలను నియమించినట్లు అధికారులు వెల్లడించారు. మరో 23 సంఘాలకు పాలకవర్గాల నియామకం చేపట్టాల్సి ఉంది. ఎన్నికలు జరిగే వరకు నామినేటెడ్ పాలకవర్గాలు కొనసాగనున్నాయి. తొలిదశలో కామారెడ్డి, మాచారెడ్డి, అంతంపల్లి, రామేశ్వర్‌పల్లి, దోమకొండ, తిప్పాపూర్, ముద్దెల్లి సహకార సంఘాలకు పాలకవర్గాలను నియమించగా, తాజాగా మరో 15 సంఘాలకు ఛైర్మన్లు, డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో..

ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని పలు సహకార సంఘాలకు నూతన పాలకవర్గాలను నియమించారు. తాడ్వాయి సింగిల్ విండో ఛైర్మన్‌గా ఎండ్రియాలకు చెందిన సంతోజిగారి సుధాకర్‌రావు, దేమికలాన్ సింగిల్ విండో ఛైర్మన్‌గా కసనోల్‌కు చెందిన ఏసగు వెంకట్‌రెడ్డిని నియమించారు. ఎల్లారెడ్డి సొసైటీ ఛైర్మన్‌గా నాగం గంగారం, మత్తమాల సొసైటీ ఛైర్మన్‌గా జైపాల్‌రెడ్డిని నియమించారు. సదాశివనగర్ సింగిల్ విండో ఛైర్మన్‌గా గాదారి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయనతో పాటు నూతన పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. సహకార సంఘాలు కేవలం రుణాలకే పరిమితం కాకుండా రైతులకు అవసరమైన వ్యవసాయ సేవలను అందించే కేంద్రాలుగా పనిచేయాల్సిన అవసరం ఉందని నూతన పాలకవర్గాలు పేర్కొంటున్నాయి. రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నామినేషన్‌పై రాజకీయ చర్చ

సహకార సంఘాల పాలకవర్గాల నియామకంతో అధికార కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తుండగా, ఈ విధానంపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులు ఎన్నుకోవాల్సిన సహకార సంఘాల పాలకవర్గాలను నామినేటెడ్ పద్ధతిలో నియమించడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

రైతు సేవలపై దృష్టి

సహకార సంఘాలు కేవలం రుణాలకే పరిమితం కాకుండా రైతులకు అవసరమైన వ్యవసాయ సేవలను అందించే కేంద్రాలుగా పనిచేయాల్సిన అవసరం ఉందని నూతన పాలకవర్గాలు పేర్కొంటున్నాయి. రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మాల్తుమ్మెద సింగల్ విండో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సురేందర్ గౌడ్



మాల్తుమ్మెద సింగల్ విండో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం..



బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అరెస్ట్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని జీజీహెచ్ మార్చురి వద్ద ఆందోళన చేస్తున్న ఆయనను అరెస్ట్ చేసి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆత్మహత్యయత్నం చేసిన సుధాకర్ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఈ క్రమంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ శ్రేణులతో కలిసి మంగళవారం ఉదయం జీజీహెచ్ మార్చురికి వచ్చారు. సుధాకర్ మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం అక్కడే ధర్నాకు దిగారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అవగాహన

అక్షరటుడే, ఎల్లారెడ్డి: మండలంలో కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ఐకేపీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మార్కెటింగ్ విభాగానికి చెందిన శిక్షకులు పుష్ప, భాగ్య, పూర్ణి కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై కమిటీ సభ్యులకు, లెక్కల నిర్వాహకులకు, కేంద్రాల బాధ్యులకు పూర్తి అవగాహన కల్పించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయడం, కేంద్రాల్లో అవసరమైన వసతులను అందుబాటులో ఉంచడం వంటి అంశాలపై సూచనలు చేశారు. సహాయ ప్రాజెక్టు అధికారి రామనారాయణ గౌడ్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ముందస్తు అరెస్ట్



అక్షరటుడే, భీమ్‌గల్: మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి.. చికిత్స పొందుతూ మృతి చెందిన సుధాకర్‌కు నివాళులు అర్పించేందుకు వస్తున్నారనే సమాచారంతో ఆయనను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పొలాస సుధాకర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో సుధాకర్ భౌతికకాయానికి నివాళులర్పించేందుకు బయలుదేరిన బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సోమవారం భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సుధాకర్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఆయనను ప్రథమ చికిత్స నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఇతర ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలతో ఆయన చనిపోయారు. పోలీసుల వేధింపుల వల్లే సుధాకర్ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే.. ఈ ఘటనలో పోలీసుల తప్పిదమేనని నిజామాబాద్ సీపీ స్పష్టం చేశారు. సంఘటనపై స్పందించిన మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి.. సంబంధిత ఎస్సైపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు..

గాంధారి మండలంలోని పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ వద్ద మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నాయి. దీంతో 'వృథాగా పోతున్నా పట్టించుకోరా..' శీర్షికతో 'అక్షరటుడే'లో కథనం ప్రచురితమైంది. దీంతో మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. పైప్‌లైన్‌కు మరమ్మతు పనులు ప్రారంభించారు. త్వరగా పనులు పూర్తిచేసి కింది వార్డు ప్రజలకు కూడా నీటిని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– అక్షరటుడే గాంధారి



ఓట్లను తొలగించేందుకు బీజేపీ కుట్ర : ఎమ్మెల్యే మదన్ మోహన్



అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఓట్లను తొలగించి బీజేపీ కుట్ర చేస్తోందని ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆరోపించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే మదన్ మోహన్, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు నల్లటి దుస్తులు, నల్లటి బ్యాడ్జీలు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. చౌరస్తా, బస్టాండ్ మీదుగా గాంధీ చౌక్ వరకు భారీ ర్యాలీ కొనసాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేశారు. ర్యాలీ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఓటుహక్కు పరిరక్షణకు అనుకూలంగా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. సామాన్య ప్రజల ఓట్లు, యువత ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆరోపించారు. ఓట్ల తొలగింపు వ్యవహారంలో ఎన్నికల కమిషన్ తీరుపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ ఛైర్మన్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఆలూర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖ ప్రారంభం



అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను బ్యాంక్ ఛైర్మన్ ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రైతులు, మహిళా సంఘాలు, చిన్న వ్యాపారులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలకు పొదుపు ఖాతాలు, రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్ తదితర సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. డీఆర్డీవో సాయన్న, రీజినల్ మేనేజర్ రంజిత్ వారణాసి, సర్పంచ్ ముక్కెర విజయ్, శాఖ మేనేజర్ నాగరాజు, గగుపల్లి సర్పంచ్ గంగాధర్, మాజీ సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, ఎస్ఎంవో అజయ్ కుమార్, ఎస్ ఎంబీ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్‌లో ఎన్నికల కమిషనర్ దిష్టిబొమ్మ దహనం



అక్షరటుడే, డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద సీఈసీ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గంగుల బాపూరావు ఆధ్వర్యంలో తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంజీవ రాజ్, గౌడ సంఘం గౌరవాధ్యక్షుడు దశ గౌడ్, డీసీసీ డెలిగేట్ మోతె చిన్న సాయన్న, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అక్షరటుడే, మాక్లూర్: వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తుందని సొసైటీ ఛైర్మన్ బూరోళ్ల అశోక్ స్పష్టం చేశారు. మండల కేంద్రం మాక్లూర్‌లోని సొసైటీ ఆవరణలో మంగళవారం 85వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీల బలోపేతం కోసం సీఎం రేవంత్ రెడ్డి అనేక సంస్కరణలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఎరువుల యాప్ వల్ల యూరియా బస్తాలు పక్కదారి పట్టే ఆస్కారం లేకుండా పోయిందన్నారు. ముందుగా ఎజెండా అంశాలతో పాటు, ఈ ఆర్థిక సంవత్సరం ఆర్థిక లావాదేవీలను కార్యదర్శి రతన్ సభ్యులకు వివరించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ ఈసారి ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పలు తీర్మానాలను ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శేఖర్, దయాకర్ రావు, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మంజీర నదీ పరీవాహక ప్రాంతంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. పోతంగల్ మండలంలో ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమార్కులు రాత్రింబవళ్లు ఇసుకను తోడేస్తూ రూ. కోట్లల్లో ఆర్జిస్తున్నారు.
- అక్షరటుడే , కోటగిరి



‘ఇందిరమ్మ’ ఇళ్ల పేరుతో.. ఇసుక దోపిడీ..!

■ మంజీరను దోచేస్తున్న ఇసుకాసురులు ■ రాత్రి, పగలు తేడా లేకుండా రవాణా
■ పోలీసుల దాడులను లైట్‌గా తీసుకుంటున్న అక్రమార్కులు ■ గ్రామాల ప్రజల గోడు వినని వ్యాపారులు

బోధన్ నియోజకవర్గంలోని పోతంగల్ మండలంలో మంజీర పరీవాహక ప్రాంతం ఇసుకాసురులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఈ ఇసుక రీచ్‌లలో అడ్డగోలుగా తవ్వేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. మంజీరను నమ్ముకుని ఈ ప్రాంతంలో సాగు చేసుకుంటున్న రైతుల నోట్లో మట్టి గొడుతున్నారు. ఈ ఇసుక మాఫియాకు రెవెన్యూశాఖ అండదండలు ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇందిరమ్మ పేరుతో.. రైస్‌మిల్లులలో డంప్..

కొందరు వ్యక్తులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో అనుమతులు తీసుకుని అడ్డగోలుగా ట్రాక్టర్లలో మంజీర నుంచి ఇసుకును తోడుతున్నారు. ఈ ఇసుకను రైస్‌మిల్లులలో డంప్ చేస్తున్నారు. అనంతరం రాత్రివేళ్లలో అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ తతంగ మంతా అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవట్లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సుంకిని, కొడిచెర్ల మీదుగా..

పోతంగల్ మండలంలో కల్లూరు నుంచి పోతంగల్, కొడిచెర్ల, హంగర్గ, కారేగాం, సుంకిని వరకు సువిశాలమైన మంజీర పరివాహక ప్రాంతం ఉంది. దీంట్లో కొడిచెర్లలో మాత్రం రెవెన్యూ రికార్డుల ప్రకారం 600 ఎకరాల పరీవాహక ప్రాంతం ఉంది. పోతంగల్ మండలంలోని రాంగంగానగర్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని ఇటీవల కలెక్టర్ పరిశీలించారు. ఈ నిర్మాణానికి ఇసుక రవాణాను అధికారికంగా అనుమతించారు. దీంతో టీజీఎండీసీ ఆధ్వర్యంలో టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతోంది. ఇదే క్రమంలో ఇతరులు సైతం రాత్రివేళ్లల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

రాత్రింబవళ్లు యథేచ్ఛగా

పోతంగల్ మండల పరిధిలో ఇసుక రవాణా రాత్రీపగలు కొనసాగుతోంది. గతంలో అనేకసార్లు ఆయా గ్రామాల ప్రజలు ఈ టిప్పర్లు, ట్రాక్టర్లను అడ్డుకుని నిరసన వ్యక్తం చేసినప్పటికీ కొన్నిరోజులు ఆగిన ఈ దందా మళ్లీ ఎప్పటిలాగే కొనసాగుతోంది. గ్రామస్థులు అడ్డుచెప్పినప్పుడు ఉదయం, మధ్యాహ్నం ఆగిన రవాణా.. రాత్రిళ్లలో ఇష్టారాజ్యంగా సాగుతోంది. ఈ ఇసుక రవాణాను పూర్తిస్థాయిలో అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏకంగా 11 ట్రాక్టర్లు సీజ్..

సుంకిని గ్రామ శివారు నుంచి ఈనెల 4వ తేదీన రాత్రి వేళ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో మూడు ఇసుకతో నిండిన ట్రాక్టర్లను, అలాగే ఇసుకను నింపుకునేందుకు సిద్ధంగా ఉన్న మరో 8 ట్రాక్టర్లను సీజ్ చేశారు. పట్టుకున్న ట్రాక్టర్లను కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్లపైనా, వాటి డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపినట్లు ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. అయితే పోలీసులు చర్యలు తీసుకుంటున్న రెవెన్యూశాఖలో కిందిస్థాయి సిబ్బంది అండతో ఈ దందా విచ్చలవిడిగా సాగుతోందని విమర్శలు వస్తున్నాయి.



ఉపేక్షించేది లేదు..

ఇసుక అక్రమ రవాణా చేస్తే ఊపేక్షించేది లేదు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తు కఠిన చర్యలు తీసుకుంటాం. వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తాం. అధికారికంగా మాత్రమే ఇసుక రవాణాకు అవకాశం ఉంది. ఎక్కడైనా మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. – **సందీప్, తహశీల్దార్, పోతంగల్**

ఎంఎస్ఎఫ్ జాతీయ సభకు తరలిన ఆర్మూర్ విద్యార్థులు



అక్షరటుడే, ఆర్మూర్: ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్ఎఫ్ జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఇన్‌ఛార్జి మైలారం బాలు ఆధ్వర్యంలో మంగళవారం పలువురు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ ఆర్మూర్ ఇన్‌ఛార్జి సాయి అశ్వత్, మద్దూరి తరుణ్, చరణ్, విఘ్నేష్, నిఖిల్, అకిల్, రుత్విక్, అర్షద్, మైలారం రాము, సిద్ధార్థ, వరుణ్, చరణ్, అభి, పవన్ తదితరులు పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ భవనంలో కంటి వైద్యశిబిరం

అక్షరటుడే, బాల్కొండ: మండలంలోని కిసాన్ నగర్‌లోని లయన్స్ భవనంలో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 31 మందికి కంటి పరీక్షలు చేశారు. పరీక్షల్లో మోతిబిందు ఉన్న వారిని గుర్తించి, శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, కార్యదర్శి చాకు లింగం, కిసాన్ నగర్ సర్పంచ్ రామరాజు గౌడ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాదగిరి గౌడ్, కార్యదర్శి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల పరిశీలన

అక్షరటుడే, పెద్దకొడప్‌గల్: మండలంలోని టీకారం తండా గ్రామ పంచాయతీ పరిధిలోని సర్దార్ తండాలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటి పనులను ఏఈ జ్యోతి, జేపీఎస్ సాయిలు పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయా అనే అంశాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి నిర్మాణ పనులను నిర్ణీత ప్రమాణాల మేరకు చేపట్టాలని, పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి లబ్ధిదారులకు సకాలంలో ఇళ్లను అందుబాటులోకి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.

భీమ్‌గల్ ఠాణాలో ఆత్మహత్యకు యత్నించిన ఛాయ్‌వాలా మృతి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ లోని భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన ఛాయ్‌వాలా సుధాకర్ మంగళవారం ఉదయం మృతి చెందాడు. పలువురు తనను వేధిస్తున్నారని ఆరోపిస్తూ సదరు టీ స్టాల్ యజమాని సుధాకర్ సోమవారం ఉదయం భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పెట్రోల్ పోసుకొని నిప్పుటించుకున్నాడు. వెంటనే స్పందించిన పోలీసులు, స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించారు. కాగా, ఆయన చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. సుధాకర్ ఘటనకు పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని సీపీ సాయి చైతన్య సోమవారం వివరణ ఇచ్చారు. భీమ్‌గల్ పట్టణవాసి సుధాకర్ బస్టాండ్ సమీపంలో టీ స్టాల్ నడుపుతున్నాడు. అయితే అతడి షాప్‌నకు ఎదురుగా ఉన్న కిరాణాషాప్‌లో సుధాకర్ సిగరెట్లు కొనడం లేదని.. ఆ షాప్ యజమాని ఇద్దరు విలేకరులను పంపించి ఆయనను బెదిరించారన్నారు. అలాగే సుధాకర్ టీస్టాల్ రాత్రి 10.30 తర్వాత కూడా తెరిచి ఉండటంతో పోలీసులు సాధారణ తనిఖీల్లో భాగంగా చూసి పీటీ కేసు పెట్టినట్లు సీపీ తెలిపారు. విలేకరులు బెదిరించిన అంశాన్ని మనసులో పెట్టుకున్న సుధాకర్ సోమవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆవరణలో నిప్పంటించుకున్నట్లు పోలీస్ కమిషనర్ వివరించారు.

ఓయూకు తరలిన ఎంఎస్ఎఫ్ నాయకులు



అక్షరటుడే, కోటగిరి : మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోచిరాం ఆధ్వర్యంలో నాయకులు ఉస్మానియా యూనివర్సిటీకి తరలివెళ్లారు. సోంపూర్ పోచిరాం మాట్లాడుతూ.. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని అన్నారు. విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి పోరాటాల రూపంలోనే ముందుకెళ్లాలని నిశ్చయించి మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ముందుకు సాగుతున్నామన్నారు. నాయకులు నేరోళ్ల అశోక్, పోశెట్టి, నాగయ్య, హరిదాస్, నవీన్, సంతోష్, నాగేష్, వినోద్, గణేష్, నర్సింలు, నితిన్ పాల్గొన్నారు.

గాంధారి ప్యాక్స్ ఛైర్మన్‌గా సాయికుమార్‌ను కొనసాగించాలి



అక్షరటుడే, గాంధారి: గాంధారి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా పెద్దబూరి సాయికుమార్‌ను యథావిధిగా కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం సమావేశమయ్యారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సంగెం రాజు మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని వివిధ వ్యవసాయ సహకార సంఘాలకు నూతన ఛైర్మన్ల నియామకం చేపట్టడం హర్షణీయమన్నారు. గాంధారి పీఏసీఎస్ ఛైర్మన్‌గా పెద్దబూరి సాయికుమార్ రైతులకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని ఆయననే తిరిగి సొసైటీ ఛైర్మన్‌గా నియమించాలన్నారు. లేని స్థితిలో భవిష్యత్తులో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి చిమ్మన్ సాయిలు, పట్టణ అధ్యక్షులు గడ్డమీద ప్రవీణ్‌కుమార్, నాయకులు లక్ష్మణ్, అశోక్, రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దహనం

అక్షరటుడే, మాక్లూర్: మండల కేంద్రంలో ఎన్నికల ముఖ్య అధికారి జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్ రావు ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమాయకుల ఓట్ల తొలగింపు అన్యాయమన్నారు. ఎన్నికల సంఘం అధికారిగా జ్ఞానేష్ కుమార్ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెంకటేశ్వర రావు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్‌కు సన్మానం



అక్షరటుడే, ముప్కాల్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముప్కాల్ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ అమీనా బేగంను సన్మానించారు. బీజేపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మ్యాక పరలక్ష్మి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. చిన్నారుల విద్యాభివృద్ధి, ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్‌రెడ్డి, గోపీనాథ్, చిల్క సాయిరాం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి...



అక్షరటుడే,ముప్కాల్: మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న సతీష్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పాఠశాల ఆవరణలో ఆయనను ఘనంగా సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సతీష్‌కు తోటి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు. సర్పంచ్ మహేష్ యాదవ్, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.